క్లుప్తంగా

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి పరామర్శ



ఉత్తమ్‌ను పరామర్శిస్తున్న యోగానందచారి

అర్వపల్లి : మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తమ్ రెడ్డి ఆదివారం మృతిచెందడంతో జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి నివాళులర్పించారు. అనంతరం ఉత్తమ్ కుమార్‌రెడ్డి దంపతులను హైదరాబాద్‌లో పరామర్శించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

పురుషోత్తంరెడ్డికి నివాళి



నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

తిరుమలగిరి : రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తంరెడ్డి ఆదివారం హైదరాబాద్‌లో చనిపోయారు. దీంతో పురుషోత్తంరెడ్డి సొంత గ్రామమైన తాటిపాములలో ఆదివారం గ్రామస్తులు ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మాజీ సర్పంచ్ కారుపోతుల అంజయ్య, ఎర్ర యాదగిరి, ఎర్ర శ్రీనివాస్, బోయినపల్లి కృష్ణయ్య, చెరుకు సోమయ్య, పులిమామిడి యాదగిరి, పరశురాములు, ఆగయ్య, పయ్యాంల రమేష్, బేతు ప్రవీణ్ ఉన్నారు.

ధరలు అదుపు చేయాలి

తుంగతుర్తి : బతుకమ్మ, దసరా పండుగలు సమీపిస్తున్న కొద్దీ రాష్ట్ర ప్రభుత్వం నిత్యావసరాల ధరలను రోజు, రోజుకూ పెంచుతోందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నిత్యావసర ధరలను సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా అదుపు చేయాలన్నారు. ధరలు పెరగడంతో పేద, మధ్య తరగతి కుటుంబాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఆయనతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు రవి, శ్రీను, వెంకన్న ఉన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు పంపిణీ చేయాలి

నాగారం : ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కడియం కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇళ్లు లేక నిరుపేదలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అధికారులు గ్రామ సభలు నిర్వహించి, రాజకీయాలకు అతీతంగా ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించాలని, ఇళ్లను పంపిణీ చేయాలని కోరారు. ఆయనతో పాటు సీపీఎం నాయకులు గుడపూడి వెంకటేశ్వర్లు, కండె భిక్షం, శ్రీరాములు, సైదులు, మల్లయ్య, రాములు, విజయ, అంజయ్య ఉన్నారు.

బెదిరింపులకు పాల్పడిన వ్యక్తులపై కేసు

చివ్వెంల : బెదిరింపులకు పాల్పడుతున్న వ్యక్తులపై ఆదివారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బి. వెంకట్ రెడ్డి తెలిపారు. వివరాల ప్రకారం.. చివ్వెంల మండల పరిధిలోని కుడకుడ గ్రామానికి చెందిన అంతటి విజయ్, గొరిగంటి విజయల మధ్య వ్యాపార విషయంలో మనస్పర్థలు ఏర్పడ్డాయి. దీంతో రవీందర్ రావు కొద్ది రోజుల క్రితం లావాదేవీల్లో భాగంగా రూ.3.58కోట్లు అంతటి విజయ్‌కి ఇచ్చాడు. ఇంకా రూ.1.30 కోట్లు ఇవ్వాల్సి ఉండగా ఆలస్యం కావడంతో అంతటి విజయ్, అతడి బావమరిది, మరో ఇద్దరు కలిసి తనను బెదిరిస్తున్నారని ఆరోపిస్తూ రవీందర్ రావు స్థానిక పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశాడు. అతడి పిర్యాదు మేరకు నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గౌడ సంఘం అధ్యక్షుడిగా మద్దెల అంజయ్యగౌడ్

మద్దిరాల : మండల పరిధిలోని కుక్కడంలో గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ గౌడ సంఘం అధ్యక్షుడిగా మద్దెల అంజయ్యగౌడ్, సభ్యులుగా మద్దెల కాశీం గౌడ్, బింగి భిక్షం, శిలివేరు సోమయ్య, మద్దెల భిక్షపతి, బొమ్మెర లక్ష్మయ్య, మద్దెల ముత్తయ్య, మల్లం సతీష్, ముసిగుంపుల చిన్న సాయిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడారు. గౌడ సంఘం అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా పని చేస్తానని అన్నారు. కార్యక్రమంలో గౌడ కులస్తులు రామచంద్రు, ముత్తయ్య, అచ్చయ్య, వెంకన్న, నాగయ్య, నర్సయ్య, రాములు, చంద్రయ్య, మదారు, శ్రీను, లింగయ్య, మల్లయ్య, వీరయ్య, యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.



గౌడ సంఘం నూతన కార్యవర్గ సభ్యులు

చెరువులు కావు.. రహదారులే!



పెన్‌పహాడ్ : చీదెళ్ల-తంగెళ్లగూడెం రహదారిపై గుంతల్లో నిలిచిన వర్షపునీరు



పెన్‌పహాడ్ : చీదెళ్ల-చెట్లముకుందాపురం వెళ్లే రహదారిపై..

- రోడ్లపై గుంతల్లో నీరు నిలిచి ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- మరమ్మతులు చేపట్టాలని వేడుకోలు

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని చీదెళ్ల-తంగెళ్లగూడెం గ్రామాల మధ్య సుమారు 3కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ రహదారి మరమ్మతులకు నోచుకోకపోవడంతో గుంతలమయంగా మారింది. గత కొన్ని సంవత్సరాల క్రితం నిర్మించిన బీటీరోడ్డుకు మరమ్మతులు చేపట్టకపోవడంతో బీటీలేచిపోయి భారీ గుంతలు ఏర్పడి మట్టిరోడ్డును తలపిస్తోంది. కొద్దిపాటి వర్షంతో పాటు పక్కన ఉన్న పంట పొలాల నీరు రోడ్డు గుంతల్లో చేరడంతో గుంతలు కనిపించక పలువురు వాహనదారులు ప్రమాదాల బారిన పడి గాయాలపాలైన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

బీటీ రోడ్లకు మరమ్మతులెప్పుడో ?

చివ్వెంల : చివ్వెంల మండలంలోని పలు గ్రామాల బీటీ రహదారులు గుంతలమయంగా మారడంతో వాహనదారులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. వట్టిఖమ్మంపహాడ్-వాల్యతండా, పాశ్యానాయక్ తండా, పిల్లలజెగ్గుతండా, అక్కలదేవిగూడెం- పాశ్యానాయక్ తండా, బి.చందుపట్ల-తిమ్మాపురం, భీమ్లాతండా-చందుపట్ల, చివ్వెంల-పాండ్యానాయక్‌తండా, లక్ష్మణ్‌నాయక్‌తండా-పులితండా గ్రామాల మధ్య బీటీ రహదారులపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఐదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఈ రహదారులపై భారీ వాహనాలు రాకపోకలు సాగించడం, వర్షాలకు వరదలు రావడం కారణంగా రోడ్లు అక్కడక్కడ దెబ్బతిన్నాయి. రాత్రివేళలో వాహనదారులు గుంతలు కనిపించక ప్రమాదాలకు గురై గాయపడుతున్నారు. ఈ విషయమై అధికారులకు ఎన్నిమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. రోడ్లకు శాశ్వత మరమ్మతులు చేపట్టాల్సిన అధికారులు అక్కడక్కడ మట్టి వేస్తూ చేతులు దులుపుకుంటున్నారని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. పైగా కొన్ని గ్రామాల రహదారులపై మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. మలుపుల వద్ద ఎలాంటి సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్లకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని, మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.



చివ్వెంల : గుంతలు పడిన వట్టిఖమ్మంపహాడ్ - పాశ్యానాయక్ తండా బీటీ రోడ్డు

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి

మండలంలోని వివిధ గ్రామాల రహదారులపై మూలమలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. మలుపుల వద్ద సూచిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు సూచిక బోర్డులు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలి.

– ధరావతు భద్రునాయక్, వాల్యతండా

రోడ్డు మరమ్మతు చేపట్టాలి

వట్టిఖమ్మంపహాడ్ గ్రామం నుంచి పాశ్యానాయక్ తండా వరకు ఉన్న బీటీ రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులకు చెప్పినా పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా రోడ్డుకు మరమ్మతులు చేయించి వాహదారుల ఇబ్బందులు తీర్చాలి

– కలకొండ రాంబాబు, వట్టిఖమ్మంపహాడ్

మరమ్మతులు చేపట్టాలి

కొన్ని సంవత్సరాల క్రితం మా గ్రామానికి నిర్మించిన బీటీ రహదారికి ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో అధ్వానంగా మారి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి గుంతలమయంగా మారిన రోడ్డుకు బీటీ నిర్మాణం చేపట్టాలి.

– నాగరాజు, తంగెళ్లగూడెం

వర్షాకాలంలో ప్రయాణం నరకమే

వివిధ పనుల నిమిత్తం గ్రామం నుంచి మండల కేంద్రంతో పాటు జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తుంది. కానీ రోడ్డుపై అడుగుకో గుంత ఏర్పడడంతో ప్రయాణం నరకంగా మారుతోంది. వర్షాకాలంలో గుంతల్లో వర్షపు నీరు చేరి రహదారి కనిపించక ప్రమాదాల బారిన పడుతున్నాం.

– నరేష్, తంగెళ్లగూడెం

పెద్దిరెడ్డి రంగారావు చిరస్మరణీయులు



మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

సూర్యాపేట : కార్మిక పక్షపాతి పెద్దిరెడ్డి రంగారావు చిరస్మరణీయులని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని త్రివేణి ఫంక్షన్ హాల్‌లో సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు బొమ్మగాని ప్రభాకర్ అధ్యక్షత నిర్వహించిన పెద్దిరెడ్డి రంగారావు దశమ వర్ధంతి సంస్మరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి మాట్లాడారు. రంగారావు స్వార్థం లేని నాయకుడిగా పని చేశారని, వారితో నాకు ఎన్నో సంవత్సరాల పరిచయం ఉండటం నా అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. అనంతరం శాసన మండలి మాజీ ఉపాధ్యక్షుడు నేతి విద్యాసాగర్ మాట్లాడారు. రంగారావు కార్మికుడిగా, పారిశ్రామికవేత్తగా సమర్థవంతంగా పనిచేశాడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్, సీపీఐ కేంద్ర సభ్యుడు కేవీఎల్, వై.వెంకటేశ్వర్లు, నెమ్మాది వెంకటేశ్వర్లు, గోపగాని వెంకటనారాయణగౌడ్, నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, గండూరి ప్రకాష్, అనంతుల మల్లీశ్వరి, షఫీఉల్లా, బూర వెంకటేశ్వర్లు, చామల అశోక్, పెద్దిరెడ్డి గణేష్, పెద్దిరెడ్డి రాజా తదితరులు పాల్గొన్నారు.

ఎరజ్రెండాకు పూర్వ వైభవం తీసుకురావాలి



మాట్లాడుతున్న నెమ్మాది వెంకటేశ్వర్లు

భానుపురి : ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తూ ఎరజ్రెండాకు పూర్వ వైభవం తీసుకురావాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన టు టౌన్ పరిధి వాణిజ్య భవన్ శాఖ మహాసభకు ఆయన హాజరై మాట్లాడారు. పట్టణంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించిన చరిత్ర సీపీఎంకు ఉందన్నారు. భవిష్యత్తులోనూ ప్రజలకు మెరుగైన వసతులు, సౌకర్యాలు అందేలా నిరంతరం ప్రజల్లో ఉంటూ ఉద్యమాలు చేపట్టాలన్నారు. అనంతరం పార్టీ వాణిజ్య భవన్ సెంటర్ శాఖ కార్యదర్శిగా బొమ్మిడి లక్ష్మీనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట గోపి, మట్టిపల్లి సైదులు, నాయకులు సోమిరెడ్డి, సురేష్, ఉపేందర్, మమత, జ్యోతి, ధనలక్ష్మి, సైదులు, వీరయ్య, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కష్టజీవులకు అండగా సీపీఎం

అర్వపల్లి : కష్టజీవులకు అండగా సీపీఎం ఉంటుందని ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు పులుసు సత్యం అన్నారు. మండల పరిధిలోని తిమ్మాపురంలో ఆదివారం నిర్వహించిన గ్రామశాఖ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతంలో ఉన్న వ్యవసాయ కార్మికులు, రైతుల హక్కుల కోసం సీపీఎం నిరంతరం ఉద్యమాలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి వజ్జ శ్రీనివాస్, ఈర్ల వెంకన్న, ఎల్లెంల అవిలయ్య, వజ్జ సైదులు, అబ్బులు, ఎస్.వెంకన్న, మద్ది రాజయ్య, బొల్లం జానయ్య, సింహాద్రి, నాగయ్య, రాములు, లింగయ్య, నవీన్, కునుకుంట్ల మహేష్, ఎల్లెంల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డు ఉద్యోగుల సామూహిక జన్మదిన వేడుకలు



సామూహిక జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్న సంఘ సభ్యులు

భానుపురి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డు ఉద్యోగుల సంఘం సూర్యాపేట కార్యాలయంలో సెప్టెంబర్ మాసంలో జన్మదినం ఉన్న పెన్షనర్ల సామూహిక జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ఎన్.సుదర్శన్ రెడ్డి మాట్లాడారు. రిటైర్డు ఉద్యోగులు సామాజిక సేవలో పాల్గొంటూ సంఘం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వి.రాములు, హమీద్ ఖాన్, సుదగాని నాగేశ్వరరావు, టి.లక్ష్మీకాంతరెడ్డి, వీరయ్య, సురేందర్ రెడ్డి, అశోక్ కుమార్, లచ్చిరెడ్డి, యాదగిరి, వెంకన్న పాల్గొన్నారు.

ప్రజారోగ్యాన్ని రక్షించడంలో విఫలం



మాట్లాడుతున్న ఎల్గూరి గోవింద్

భానుపురి : అంటువ్యాధులు, విష జ్వరాల నుంచి ప్రజారోగ్యాన్ని రక్షించడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎల్గూరి గోవింద్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సీతారాంపురం కాలనీలో నిర్వహించిన మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం కుల గణన చేపట్టి స్థానిక సంస్థలకు రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. స్థానిక సంస్థల పదవీకాలం ముగిసినా ఎన్నికలు నిర్వహించకపోవడంతో పాలన కుంటుపడిందని తెలిపారు. గ్రామాలు, మున్సిపాలిటీలలో ప్రజలు విష జ్వరాల బారిన పడి వేలాది రూపాయలను ఖర్చు చేసుకుంటున్నారని చెప్పారు. అనంతరం వార్డు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు అరవపల్లి లింగయ్య, షేక్ సైదులు, సాయికుమార్, నాగరాజు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

మద్దిరాల : మద్దిరాల మండల పరిధిలోని కుంటపల్లి గ్రామంలో ఆదివారం విద్యుదాఘాతంతో గేదె మృతి చెందింది. స్థానికులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన చిన్న గండయ్య తన గేదెను మేత కోసం తీసుకెళ్లాడు. అయితే ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభం స్టే వైర్‌కు తగలడంతో విద్యుదాఘాతం ఏర్పడి గేదె అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ రూ.60వేలు ఉంటుందని, ప్రభుత్వం నష్ట పరిహారం అందజేసి ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నూతనకల్ : నూతనకల్ మండల కేంద్రానికి చెందిన నాగార్జున ఉన్నత పాఠశాలలో 1998–99 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తరగతి గదుల్లోని జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం తమ కు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మారగాని వెంకట్‌గౌడ్, పూర్వ ఉపాధ్యాయులు బొక్క వీరా రెడ్డి, మాదిరెడ్డి దీన్‌దయాల్‌రెడ్డి, మందడి సోమిరెడ్డి, కళ్లెం ఉపేందర్‌రెడ్డి, మంజుల, లింగయ్య, వెంకట్‌రెడ్డి, శరత్, రాజశేఖర్, చంద్రయ్య, ఉమ, విజిత తదితరులు పాల్గొన్నారు.

గుండె వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రేమ్‌కుమార్

సూర్యాపేట : గుండె వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ ప్రేమ్ కుమార్ అన్నారు. ఆదివారం వరల్డ్ హార్ట్ డే సందర్భంగా జిల్లా ఆర్వీ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్‌లో మెగా గుండె వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్డియాలజిస్ట్ డాక్టర్ ప్రేమ్ కుమార్ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై, గుండె సంబంధిత వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. క్రమం తప్పకుండా గుండె పరీక్షలు చేయించుకోవాలన్నారు. మంచి ఆహారపు అలవాట్లు, ఉత్తమమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ప్రతిరోజూ వ్యాయామం, జాగింగ్ చేయాలన్నారు. గుండెలో వచ్చే మంటను కొందరు గ్యాస్ సమస్యగా భావించి మందులు వాడతారని, తరువాత నయం కాని సమయంలో కార్డియాలజిస్టును సంప్రదిస్తారన్నారు. అప్పటికే ఆలస్యం కావడం వల్ల హార్ట్ స్ట్రోక్ వచ్చే ప్రమాదం ఉందని చెప్పారు. గుండె జబ్బులు వచ్చిన వారిని సకాలంలో ఆస్పత్రికి తీసుకు వస్తే రోగిని చికిత్స చేసి బతికించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కాంతారావు, డాక్టర్ రమేష్, డాక్టర్ బెల్లంకొండ ప్రియాంక, టీపీయూఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బెల్లంకొండ రామ్మూర్తి గౌడ్, ఆర్.సురేష్, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో గోల్డ్ మెడల్

తుంగతుర్తి : తుంగతుర్తి మండల కేంద్రంలోని విద్యా భారతి పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న సాయిదీక్షిత్ నాయక్ కరాటేలో గోల్డ్ మెడల్ సాధించాడు. మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన 22వ జాతీయ ఓపెన్ కరాటే పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించాడు. దీంతో ఆ విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

అక్షర ఫౌండేషన్ పురస్కారం ప్రదానం

తుంగతుర్తి : అక్షర ఫౌండేషన్ రాష్ట్రస్థాయి ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం–2024కు గాను తుంగతుర్తి మండల పరిధిలోని వెంపటి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు మల్లేపాక రవీందర్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో అక్షర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు యాస రాంకుమార్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ప్రతిభను గుర్తించి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగాఎంపిక చేసిన అక్షర ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఐలమ్మ విగ్రహం ఏర్పాటుకు కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ సభ్యులు

తుంగతుర్తి : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటుకు రజక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలో పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పూసపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా మడిపెద్ది వెంకన్న, అక్కెనపల్లి రాములు, ప్రధాన కార్యదర్శిగా వడ్లకొండ వెంకన్న, కోశాధికారిగా నారాయణదాసు నాగరాజు, సంయుక్త కార్యదర్శిగా నారాయణదాస్ సోమన్న ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు పూసపెల్లి యాదగిరి, వడ్లకొండ శ్రీను, నారాయణదాసు నర్సయ్య, భద్రయ్య, శ్రీను, నాగయ్య, రమేష్, నరేష్, అంజి, సతయ్య, సైదులు, నరేందర్, వెంకన్న, సతీష్, శివ పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే లక్ష్యం



ఆర్థికసాయం చేస్తున్న గ్రూప్ సభ్యులు

నూతనకల్ : ఆపదలో ఉండి పేదరికంతో ఇబ్బంది పడుతున్న కుటుంబాలను ఆదుకోవడమే జనం కోసం మనం గ్రూప్ లక్ష్యమని గ్రూప్ సభ్యులు అన్నారు. నల్లగొండ జిల్లా నకిరేకల్ పట్టణానికి చెందిన పుష్పలత అనారోగ్యంతో బాధపడుతూ వైద్య ఖర్చులకు డబ్బులు లేక ఇబ్బంది పడుతుండడంతో ఆదివారం జనం కోసం మనం గ్రూప్ సభ్యులు రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రూప్ సభ్యులు ప్రతి నెలా తమకు తోచినంత డబ్బును కూడబెట్టి ఆపదలో ఉన్న వారికి అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రూప్ సభ్యులు రేసు రవి, గంటా నాగన్న, ఊర్గుల మురళి, గడ్డం జానయ్య పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి చేయూత

మండల పరిధిలోని యడవెల్లి గ్రామానికి చెందిన భయ్యా గుర్వయ్య ఇటీవల మృతి చెందాడు. దీంతో మృతుడి కుటుంబ సభ్యులను మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గాజుల తిర్మల్‌రావు ఆదివారం పరామర్శించారు. మృతుడి కుటుంబ సభ్యులకు క్వింటా బియ్యం అందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తూముల వెంకటేశ్వరరావు, భయ్యా లింగయ్య, గాజుల ఉపేందర్, బొడ్డు వెంకన్న, గాజుల ఆంధ్రయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు, మల్లేబోయిన ప్రవీణ్, గాజుల నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

మద్దిరాల : మద్దిరాల మండల పరిధిలోని చిన్ననెమిల గ్రామానికి చెందిన పులుసు వెంకటేష్‌కు మంజూరైన రూ.40వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే మందుల సామేల్ ఆదేశానుసారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు యాదవ్ ఆదివారం మండల కేంద్రంలో లబ్ధిదారుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి బొబ్బిలి వెంకన్న, ఎండీ నజీర్ ఖాన్, జాటోత్ చెన్ను నాయక్, లకావత్ రాములు తదితరులు పాల్గొన్నారు.

సూర్యక్షేత్రాన్ని సందర్శించిన విద్యార్థులు



సూర్యక్షేత్రాన్ని సందర్శించిన విద్యార్థులు, పాఠశాలల సిబ్బంది

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురంలోని సూర్యక్షేత్రాన్ని ఆదివారం నల్లగొండ, సూర్యాపేట, అర్వపల్లి తదితర ప్రాంతాలకు చెందిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు సందర్శించారు. క్షేత్ర సందర్శనలో భాగంగా సూర్యక్షేత్రాన్ని సందర్శించి పూజలు చేశారు. ఈ సందర్భంగా క్షేత్ర వ్యవస్థాపకుడు జనార్దన్ స్వామి మాట్లాడుతూ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు సూర్యక్షేత్ర విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఘనపురం నరేష్, అర్చకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలు భయాందోళనకు గురికావొద్దు

నాగారం : అక్రమ నిర్మాణాలు కూల్చివేస్తున్న హైడ్రా పట్ల ప్రజలు ఎలాంటి భయాందోళనకు గురికావొద్దని టీపీసీసీ మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ కొలిపాక సాయికుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఇబ్బందులు తీర్చుతుంది తప్పా, కొత్త సమస్యలను సృష్టించదన్నారు. హైడ్రా పట్ల ప్రతిపక్షాలు సృష్టిస్తున్న అపోహలను ప్రజలు నమ్మవద్దని అన్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఉన్న భూములను కాపాడి చెరువుల విస్తీర్ణాన్ని పెంచేందుకు తీసుకువచ్చిన హైడ్రా బడా బాబులు, అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తుందన్నారు. హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాల్లో కూల్చివేసిన భవనాలు అక్రమ కట్టడాలని, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో ఉన్నవే అని తెలిపారు. కొందరు తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజల్లో అపోహలు సృష్టిస్తూ భయాందోళనలకు గురిచేస్తున్నారని అన్నారు. సామాన్య ప్రజల కష్టాలు ప్రభుత్వానికి తెలుసు అని, వారికి హైడ్రా హాని తలపెట్టదని తెలిపారు. ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

భావితరాల సంక్షేమానికే హైడ్రా

తుంగతుర్తి : కాంగ్రెస్ ప్రభుత్వం భావితరాల సంక్షేమం కోసమే హైడ్రాను ఏర్పాటు చేసిందని కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు చింతకుంట్ల వెంకన్న అన్నారు. ఆదివారం తుంగతుర్తి మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న చెరువులు, కుంటలను ఆక్రమించుకొని ఇళ్లు, పార్కులు, కన్వెన్షన్లు నిర్మించడం వల్ల వరదలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దీనిని నిర్మూలించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రాను తీసుకొచ్చిందని తెలిపారు. ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

బతుకమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు

అర్వపల్లి : బతుకమ్మ ఉత్సవాల నేపథ్యంలో అర్వపల్లిలోని కొత్తకుంట వద్ద ఉన్న బతుకమ్మ ఘాట్‌ను ఆదివారం గ్రామ పంచాయతీ సిబ్బంది శుభ్రం చేశారు. బతుకమ్మ ఘాట్ వద్ద పిచ్చిమొక్కలను తొలగించారు. బతుకమ్మ ఉత్సవాలు మరో రెండు రోజుల్లో ప్రారంభం కానుండటంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి జ్యోతి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది ఉన్నారు.